ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

గురువారం 3 జులై 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి చెన్నై కార్యాలయం చిరునామా మార్పు..

"జి.4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెంబరు:40, న్యూనెంబర్: 35, విజయరాఘవరోడ్డు, టి.నగర్, చెన్నై-600 017" చిరునామాలో మంగళవారం నుంచి చెన్నై కార్యాలయం పని చేయనుంది. పాఠకులు గమనించగలరు.



నూతన వధూవరులకు కానుకలు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

మాది.. భక్తులు మెచ్చిన ప్రభుత్వం

● ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు ● సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వ పాలన చూసి ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు మెచ్చుకుంటున్నారని, గతంలో లేని విధంగా మూడువేలకు పైగా సుప్రసిద్ధ ఆలయాలకు మహాకుంభాభిషేకాలను జరిపించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. భక్తిపేరుతో కపటనాటకాలాడేవారు, ఆధ్యాత్మిక భావాలను కాపాడేది తామేనంటూ గొప్పలు చెప్పుకుంటున్న మతతత్త్వవాదులు డీఎంకే ప్రభుత్వాన్ని మెచ్చుకుంటున్న భక్తులను చూసి ఓర్వలేక పసలేని విమర్శలు చేస్తున్నారని, అలాంటివారి విమర్శలను పట్టించుకోనన్నారు. స్థానిక రాజా అన్నామలైపురం కపాలీశ్వర కల్యాణమండపంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 32 జంటలకు బుధవారం సామూహిక వివాహం జరిగింది. ఈ వేడుకలకు సీఎం స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరైన నూతన వధూవరులకు సారె సామగ్రి అందజేసి, వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో తాను దేవాదాయ శాఖ నిర్వహించిన కార్యక్రమాల్లోనే అత్యధికంగా పాల్గొన్నానని, సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలే ఎక్కువన్నారు. దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు చూపించే చొరవ, శ్రద్ధవల్లే ఆధ్మాత్మిక కార్యక్రమాలు గతం కంటే ఎక్కువగా జరుగుతున్నాయని ప్రశంసించారు. సుప్రసిద్ధ ఆలయాలన్నీ కళకళలాడుతున్నాయని, నైవేద్యం, దీపారాధనకు నోచుకోని ఎన్నో వేల ఆలయాలు ప్రస్తుతం మూడుపూటలా నైవేద్యం, పూజా కార్యక్రమాలు జరుపుతున్నామని చెప్పారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 3177 ఆలయాలకు కుంభాభిషేకాలు జరిపామని, కబ్జాకు గురైన 997 ఆలయాలకు సంబంధించిన రూ.7701కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని, వెయ్యేళ్లనాటి ప్రాచీన ఆలయాలను వాటి ప్రాచీనత, సౌందర్యానికి భంగం కలుగని రీతిలో పునర్నిర్మించామని చెప్పారు. ఇదే రీతిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిరుపేద జంటలకు ఉచిత వివాహాలు కూడా జరిపిస్తున్నామని తెలిపారు. ఇలా ఆధ్యాతికవాదులంతా మెచ్చుకునే ద్రావిడ తరహా డీఎంకే పాలన చూసి ఓర్వలేకనే భక్తిపేరుతో పగటి వేషం వేసుకునేవారంతా విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 'సేవ చేయడమే నా విద్యుక్తధర్మం' అంటూ తమిళభక్త శిఖామణి తిరునావుక్కరసర్ చెప్పినట్టు విమర్శలను పట్టించుకోకుండా ప్రజలకు నిరంతరం సేవలందించటమే తన ధర్మంగా ఆచరిస్తున్నానని స్టాలిన్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్‌బాబు, కేఎన్ నెహ్రూ, ఎం.సుబ్రమణ్యం, శివజ్ఞానబాల్య స్వామి, ఆది శివలింగాచార్య గురుస్వామి, మేయర్ ఆర్. ప్రియా, డిప్యూటీమేయర్ మహేష్‌కుమార్, శాసనసభ్యులు వేలు, తాయగం కవి, జే.కరుణానిధి, జోసెఫ్ సామువేల్, ఆధ్యాత్మిక ప్రవచనకర్త సుకి శివం, రామసుబ్రమణ్యం, అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మణివాసన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంకే నుంచి ఎమ్మెల్యే అరుళ్ తొలగింపు



ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) శాసనసభ్యుడు అరుళ్‌ను పార్టీ నుండి తొలగించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఓ ప్రకటనలో తెలిపారు. పీఎంకేలో గత కొన్ని నెలలుగా తండ్రికొడుకులైన రాందాస్, అన్బుమణి మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలో, రాందాస్‌కు మద్దతుగా ఎమ్మెల్యే అరుళ్ వ్యవహరించిన కారణంగా పీఎంకే సేలం జిల్లా కార్యదర్శి పదవినుంచి అన్బుమణి తొలగించారు. రెండు రోజులక్రితం అన్బుమణికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే అరుళ్ విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో అరుళ్ పార్టీ నిబంధనలు అతిక్రమించారనే కారణంతో పార్టీ సభ్యత్వం నుంచి తొలగిస్తూ అన్బుమణి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

అన్బుమణికి ఆ అధికారం లేదు...

పార్టీ సభ్యత్వం నుండి తనను తొలగించే అధికారం పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణికి లేదని ఆ పార్టీ ఎమ్మెల్యే ఇరా అరుళ్ తెలిపారు. అన్బుమణి పార్టీకి కార్యాచరణ అధ్యక్షుడు మాత్రమేనని, తనను పార్టీ నుండి తొలగించే అధికారం లేదని స్పష్టం చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తప్ప ఇంకెవరూ పార్టీ నుండి బహిష్కరించలేరని వివరించారు.

అటవీ సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అటవీ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. శాసనసభ సమావేశాల్లో జనవరి 11న అటవీ శాఖ మంత్రి పొన్ముడి, తమిళనాడు అటవీ చట్టాన్ని సవరిస్తూ బిల్లు ప్రవేశపెట్టారని, ఈ బిల్లు ఆమోదానికి గవర్నర్‌కు పంపామని తెలిపింది.ఐదు నెలల తర్వాత బిల్లును గవర్నర్ ఆమోదించారని పేర్కొంది. ఈ సవరణ చట్టం ప్రకారం, అటవీ భూములను అటవీయేతర ప్రయోజనాలు, ఇతర ప్రయోజనాలకు ఉపయోగించే సమయంలో కొంత మేర మాత్రమే భూములు సేకరించాలి.అటవీ విస్తీర్ణం పెంచడం, అటవీయేతర భూములను అడవులుగా ప్రకటించే అధికారం జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు.



అజిత్‌కుమార్ తమ్ముడికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న మంత్రి పెరియకరుప్పన్

అజిత్ సోదరుడికి ఆవిన్‌లో ఉద్యోగం

● ఇంటిపట్టా అందజేత

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనంలో అమ్మవారి ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ పోలీస్ లాకప్‌లో మృతి చెందిన నేపథ్యంలో అతడి సోదరుడికి రాష్ట్ర ప్రభుత్వం ఆవిన్ సంస్థలో ఉద్యోగావకాశం కల్పించింది. అదే విధంగా అజిత్‌కుమార్ కుటుంబానికి ఇంటి స్థల పట్టా కూడా మంజూరు చేసింది. మంగళవారం సాయంత్రం అజిత్‌కుమార్ తల్లికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఫోన్‌చేసి ఓదార్చి జరిగిన సంఘటనకు క్షమాపణ తెలిపారు. అంతే కాకుండా కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఆ సమయంలో తాము నిరుపేదలమని, రెండు నెలల క్రితమే ఆలయ వాచ్‌మన్‌గా పనిలోకి చేరిన అజిత్‌కుమార్ సంపాదిస్తే కుటుంబం బాగుపడుతుందని ఆశపడ్డామని, చివరకు పెద్దకుమారుడిని కోల్పోయి తీరని దిగులుతో బాధపడుతున్నామని అతడి తల్లి సీఎంకు చెప్పారు. ఈ నేపథ్యంలో అజిత్‌కుమార్ సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, నివసించడానికి స్థలం కూడా కేటాయిస్తామని, ఆ విషయమై తక్షణ చర్యలు చేపడతానని స్టాలిన్ ఆమెకు హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే బుధవారం ఉదయం మంత్రి పెరియకరుప్పన్ తిరుభువనంలోని అజిత్‌కుమార్ ఇంటికి వెళ్ళి అతడి తల్లి, తమ్ముడిని కలుసుకున్నారు. ఆ తర్వాత అజిత్‌కుమార్ తమ్ముడికి ఆవిన్ సంస్థలో ఉద్యోగం కల్పిస్తూ నియామక పత్రాన్ని, అతడి తల్లికి ఇంటి నివేశన పట్టా అందజేశారు. .

వాచ్‌మన్ కుటుంబానికి విజయ్ పరామర్శ

పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన అజిత్‌కుమార్ కుటుంబాన్ని టీవీకే నేత, సినీ నటుడు విజయ్ బుధవారం పరామర్శించారు. ఈ మేరకు ఆ కుటుంబానికి భరోసా ఇచ్చి, త్వరలో ఆర్థిక సాయం కూడా అందిస్తామని ప్రకటించారు. విజయత్‌తో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కూడా ఉన్నారు.

● లాకప్‌డెత్ ఎఫెక్ట్ ...

అనధికారిక ప్రత్యేక విచారణ బృందాల రద్దు

| డీజీపీ శంకర్‌జివాల్ |



చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనం లాకప్‌డెత్ సంఘటన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికారులకు తోడుగా పనిచేసే అనధికారిక ప్రత్యేక విచారణ దళాలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు డీజీపీ శంకర్‌జివాల్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీలు, జోనల్ ఐజీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు పంపించినట్టు ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. శివగంగ జిల్లా తిరుభువనం మడపురం ఆలయానికి వచ్చన ఓ భక్తురాలి నగలు చోరీకి గురైన సంఘటనలో ఆ ఆలయం వద్ద పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ సంస్థ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌ను పోలీసులు విచారణకు తీసుకెళ్లారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే విచారణ బాధ్యతలను స్వీకరించిన అనధికారిక ప్రత్యేక విచారణ దళానికి చెందిన ఐదుగురు పోలీసులు అజిత్‌కుమార్ పలుచోట్లకు తీసుకెళ్ళి చిత్రహింసలకు గురిచేశారు. దీంతో అజిత్‌కుమార్ తీవ్ర గాయాలతో మృతి చెందాడు.ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించింది, అజిత్‌కుమార్ మృతికి ప్రత్యేక విచారణ దళాలకు చెందిన కానిస్టేబుళ్ల కారణమని వెల్లడైంది. దీనికి తగ్గట్లుగానే అజిత్‌కుమార్‌పై ఆ దళాలకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్ల మఫ్టీలో కట్టెతో కొడుతున్న దృశ్యాలతో వీడియో ఒకటి మంగళవారం రోజంతా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న డీజీపీ శంకర్‌జివాల్ రాష్ట్ర వ్యాప్తంగా డీసీపీలు, ఎస్పీలు, డీఎస్పీల క్రింద పనిచేస్తున్న అనధికారిక ప్రత్యేక విచారణ దళాలను శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అనధికారిక ప్రత్యేక విచారణ దళాల్లో వేల సంఖ్యలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లందరికీ ప్రత్యామ్నాయ విభాగాల్లో పనికల్పించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

లాకప్‌డెత్‌పై జిల్లా జడ్జి విచారణ ప్రారంభం

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనంలో వాచ్‌మన్ అజిత్‌కుమార్ మృతి సంఘటనపై మదురై 4వ అదనపు జిల్లా జడ్జి జాన్ సుందర్‌లాల్ సురేష్ బుధవారం విచారణ ప్రారంభించారు.ఈ సంఘటనపై విచారణ జరిపిన హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఈ లాకప్‌డెత్ విచారణను జడ్జి జాన్ సుందర్ లాల్ సురేష్‌కు అప్పగిస్తూ, ఈ నెల 8లోగా ఆయన విచారణ నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించింది. ఆ ఉత్తర్వుల మేరకు జడ్జి జాన్ సుందర్‌లాల్ బుధవారం మదురై నుండి తిరుభువనం చేరుకున్నారు. మడపురం భద్రకాళి ఆలయానికి వెళ్ళి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుభువనం పోలీసుస్టేషన్ లోని ప్రత్యేక గదిలో ఆయన విచారణ ప్రారంభించారు. అనంతరం మడపురం భద్రకాళి ఆలయం వద్దకు వెళ్ళి అక్కడి సీసీ కెమెరాలున్నాయా అని పరిశీలించారు. ఆ సీసీ ఫుటేజీ స్థానిక పోలీసులు భద్రపరచినట్లు తెలుపగానే గురువారం ఉదయం వాటిని తనకు అందజేయాలని ఆదేశించారు. ఆ తర్వాత అజిత్‌కుమార్‌ను పోలీసులు కొట్టినట్టు చెబుతున్న ఆలయం వెనుకవైపు ప్రాంతాన్ని ఆయన తనిఖీ చేశారు.

డీఎంకే పాలనను విమర్శించను కూటమిని విడిచి పెట్టను

● ఎండీఎంకే నేత వైగో



ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సత్కరిస్తున్న వైగో

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలనపై తాను ఎలాంటి విమర్శలు చేయలేదని, భవిష్యత్తులోనూ ఆరోపణలు, విమర్శలు చేయబోనని ఎండీఎంకే నేత వైగో స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ఆయన అన్నా అరివాలయానికి వెళ్ళి డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని, సత్కరించారు. సుమారు పావుగంట సేపు సమావేశమై రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై సమీక్షించి, అసెంబ్లీ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహరచనలపై చర్చించారు. ఈ సమావేశం అనంతరం అరివాలయం వెలుపల వైగో మడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని చెప్పారు. డీఎంకే, ఎండీఎంకే మధ్య విబేధాలు ఏర్పడ్డాయని ఇటీవల వచ్చిన పుకార్లను ఆయన తోసిపుచ్చారు. రెండు పార్టీల మధ్య సన్నిహిత సంబంధాలు పటిష్టంగా ఉన్నాయని చెప్పారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పది సీట్లకంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని ఎండీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో తీర్మానం చేసినమాట వాస్తవమేనని, అదే సమయంలో డీఎంకే అధిష్టానంపై ఒత్తిడి చేసే ప్రసక్తే లేదని వైగో పేర్కొన్నారు.



వృద్ధురాలికి రేషన్ సరుకులు అందిస్తున్న ఉద్యోగులు

ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించే ప్రక్రియకు ప్రజాదరణ లభించింది. రేషన్ దుకాణాలకు వెళ్లి కూళ్ళైన్ల గంటల కొద్దీ నిలబడి సరుకులు తెచ్చుకోవడంలో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం, 70 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వారిళ్ల వద్దకే వెళ్లి ఉచిత బియ్యం, గోధుమలు, తక్కువ ధరకు పామాయిల్, కందిపప్పు, చక్కెర అందించాలని నిర్ణయించి, 10 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా పంపిణీని ప్రారంభించింది. అందుకోసం దివ్యాంగులు, వృద్ధుల వివరాలు జిల్లా యంత్రాంగం సేకరించింది. ఆ ప్రకారం, దిండుగల్ జిల్లా కొడైకెనాల్ 24వ వార్డు పరిధిలోని అన్నాసాలై, పినిస్‌విల్లా తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న 492 మంది వృద్ధుల ఇళ్ల వద్దకు వాహనంలో వెళ్లిన రేషన్ సిబ్బంది, వారికి సరుకులు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి సోనోవాల్ తదితరులు

క్రూయిజ్ కనెక్టివిటీ పెంపుపై దృష్టి

● కేంద్ర నౌకాయాన మంత్రి సర్బానంద ● మహాబలిపురంలో 'ఏషియన్ - ఇండియా' సదస్సు

అడయార్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ సముద్ర ప్రాంతంలో క్రూయిజ్ టూరిజం హబ్ అభివృద్ధి చేయడానికి భారతదేశం ఆసియాన్ దేశాలతో కలిసి పనిచేస్తుందని కేంద్ర నౌకాయాన శాఖామంత్రి సర్బానంద్ సోనోవాల్ పేర్కొన్నారు. సముద్ర జలాల్లో క్రూయిజ్ కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు ఇండో పసిఫిక్ ప్రాంతం అంతటా స్థిరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. చెన్నై పోర్టులోని ఎంవీ ఎంప్రెస్ (కార్డెలియా క్రూయిజ్ షిప్)లో 'ఆసియా - ఇండియా క్రూయిజ్ డైలాగ్స్' తొలిసారి జరిగాయి. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ సదస్సులో ఏషియన్ సభ్య దేశాలైన బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావో పీడీఆర్, మలేసియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో మంత్రి సోనోవాల్ మాట్లాడుతూ, 'సాగర మాల ప్రాజెక్టులో భాగంగా 2029 నాటికి పది లక్షల క్రూయిజ్ ప్రయాణికులను ఆకర్షించేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. 2013-14లో 102 మంది షిప్ కాల్స్ ఉండగా, విధానపరమైన సంస్కరణలు, మెరుగైన పోర్ట్ మౌలిక సదుపాయాల రూపకల్పన కారణంగా ప్రస్తుతం ఇది 14 వేలకు చేరుకుందన్నారు. బంగాళాఖాతంలో క్రూయిజ్ పర్యాటక, పర్యాటక సర్క్యూట్‌లను, హిందూ మహాసముద్ర ప్రాంతం లో అభివృద్ధి చేయడానికి ఏషియన్ దేశాలతో కలిసి పనిచేయాలని భారత్ యోచిస్తోందన్నారు. రియల్ టైమ్ ట్రాకింగ్, ఆధునిక టెర్మినల్స్ ద్వారా ఏషియన్ దేశాలతో భారతీయ ఓడరేవులను అనుసంధానించే ఇంటిగ్రేటెడ్ క్రూయిజ్ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర నౌకాయాన సహాయ మంత్రి శాంతను ఠాగూర్, చెన్నై పోర్టు ట్రస్ట్, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాశాఖకు నిధుల విడుదలకు కేంద్రం నిరాకరణ

ఐసిఎఫ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.1,800 కోట్లు విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తోందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఆరోపించారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... నూతన జాతీయ విద్యా విధానాన్ని అంగీకరిస్తేనే నిధులు విడుదల చేస్తామని కేంద్ర ప్రభుత్వం బెదిరిస్తుందన్నారు. ఈ నెల 7వ తేది ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

జనరేటర్ పొగకు ఊపిరాడక తండ్రీకుమారుల మృతి

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ సమీపంలోని కదిర్ వేడులో జనరేటర్ పొగ కారణంగా ఊపిరాడక ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. కదిర్‌వేడు బ్రిటానియా నగర్ 10వ వీధిలోని గంగా అవెన్యూ జంక్షన్ ప్రాంతంలో సెల్వరాజ్ (57) నివసిస్తున్నాడు. మాదవరంలో ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో పనిచేస్తున్న సెల్వరాజ్, రెండేళ్లుగా అద్దింట్లో నివాసం ఉంటున్నారు. ఆయనకు మాల అనే భార్య, ఇదయ (16) అనే కుమార్తె, సుమన్‌రాజ్ (15), గోకుల్ రాజ్ (13) అనే ఇద్దరు కుమారులున్నారు. మంగళవారం రాత్రి సెల్వరాజ్, ఆయన కుమారులు సుమన్‌రాజ్, గోకుల్‌రాజ్ ఒక గదిలోను, మాల, కుమార్తె ఇదయా మరొక గదిలో నిద్రపోయారు. బుధవారం ఉదయం చాలాసేపటివరకూ సెల్వరాజ్ గది నుండి ఎలాంటి అలికిడి వినకపోవడంతో ఆయన భార్య చుట్టుపక్కల వారి సాయంతో గది తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్ళింది. ఆ గదిలో సెల్వరాజ్, ఆయన కుమారులు నోటిలో నురగలు కారుతూ శవాలుగా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే పుళల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఆ తర్వాత పోలీసులు సెల్వరాజ్ నిద్రపోయిన గది పరిశీలించగా, ఆ గదిలో ఓ మూల ఉన్న జనరేటర్ నుండి పొగ రావడం గమనించారు. బుధవారం వేకువజాము రెండు గంటలకు ఆ ప్రాంతంలో కరెంట్ పోయిందని, దీంతో సెల్వరాజ్ జనరేటర్ ఆన్ చేసి నిద్ర పోయి ఉంటాడని, ఎక్కువసేపు జనరేటర్ పనిచేయడం వల్ల గది అంతా పొగ కమ్ముకుని, ఊపిరాడక ముగ్గురూ దుర్మరణం చెంది ఉంటారని భావిస్తున్నారు.

శంకరన్‌కోవిల్ మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

● పదవి కోల్పోయిన డీఎంకే చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి



పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్ల వ్యతిరేకతతో మహిళా చైర్మన్ తన పదవి కోల్పోయారు. తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోయిల్ మున్సిపాలిటీలో 30 వార్డులుండగా, అధిక కౌన్సిలర్లున్న డీఎంకే అధికారం చేపట్టింది. ఆ పార్టీకి చెందిన ఉమామహేశ్వరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతుల కల్పన, వీధి దీపాలు, రోడ్ల నిర్మాణం తదితరాలు చేపట్టాలని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు కోరినా చైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదని సమాచారం. దీంతో కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ఓటింగ్ బుధవారం జరిగింది. డీఎంకే, అన్నాడీఎంకే, డీఎండీకే కౌన్సిలర్లు మొత్తం 28 మంది చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయగా, ఒక ఓటు మాత్రమే అనుకూలంగా వచ్చింది. దీంతో, ఉమామహేశ్వరి చైర్‌పర్సన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది.

సమాచార దర్శిని

నేడు ఆలస్యంగా బయల్దేరనున్న పినాకిని ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్‌లోని పలు మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్-విజయవాడ పినాకిని ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయల్దేరుతుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఈ నెల 3,10,17 తేదీల్లో చెన్నై సెంట్రల్ సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 2.05 గంటలకు బయల్దేరాల్సిన పినాకినీ ఎక్స్‌ప్రెస్, గంటన్నర ఆలస్యంగా 3.35 గంటలకు బయల్దేరుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

7న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తమిళ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'తమిళనాడు డే'ను పురస్కరించుకుని విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా యంత్రాంగం విడుదల చేసిన ప్రకటనలో, జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఈ నెల 7వ తేది చింతాద్రిపేటలోని కల్యాణం మహిళా మహోన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు పాల్గొనే ఈ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.10,000, రెండవ బహుమతిగా రూ.7,000, మూడవ బహుమతిగా రూ.5,000 అందించనున్నారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తర చెన్నైలో ఏసీ బస్టాండ్లు

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో రూ.8 కోట్లతో ఏసీ బస్టాండ్లు ఏర్పాటుకానున్నాయి. రాయపురం, పెరంబూర్, కొళత్తూర్, హార్బర్ ప్రాంతాల్లో ఆధునిక వసతులు, సీటింగ్, ఛార్జింగ్ పాయింట్లు తదితరాలతో కూడిన ఏసీ బస్టాండ్ల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

కోవైలో 'గోల్డ్ జ్యువెలరీ పార్క్'

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో 'గోల్డ్ జ్యువెలరీ పార్క్' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. 2.46 ఎకరాల్లో రూ.45 కోట్లతో ఆ పార్క్ ఏర్పాటుకానుంది. ఆ పార్క్ నిర్మాణాలు చేపట్టే సంస్థ ఎంపిక కోసం టెండర్లు ఆహ్వానించినట్లు సిడ్కో అధికారులు తెలిపారు.

కార్పొరేషన్ ఐటీఐలో ఉచిత అడ్మిషన్లు

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలోని ఐటీఐలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్లలో కార్పొరేషన్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పారిశుధ్య సిబ్బంది వారసులకు ప్రాధాన్యత కల్పించనున్నారు. ఐటీఐలో ఆరు కోర్సులుండగా, 14 నుంచి 40 ఏళ్లలోపున్న పురుషులు చేరవచ్చు. మహిళలకు వయోఃపరిమితి లేదు. అడ్మిషన్ల పొందిన విద్యార్థులకు బస్ పాస్, యూనిఫాం, షూ సహా పలు విద్యా ఉపకరణాలు, మధ్యాహ్న భోజనం, స్నాక్స్, నెలకు రూ.750 అలవెన్స్ అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.chennaicorporation.gov.in అనే వెబ్‌సైట్, రాయపేట లాయిడ్స్ కాలనీ ముత్తయ్య వీధిలో ఉన్న ఐటీఐ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

'ఏరియా కమాండర్' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు శాఖలో 'ఏరియా కమాండర్' పోస్టులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. యువకులు, అంకిత భావంతో సేవలందించేలా ఉన్నతాధికారులు, టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులకు ఎలాంటి వేతనం ఉండదు. సత్ ప్రవర్తన, ఎలాంటి క్రిమినల్ చరిత్ర లేని నగరానికి చెంది, రేషన్ కార్డుల్లో పేరున్న 18 నుంచి 50 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుతో పాటు వారి సేవా కార్యక్రమాలతో కూడిన వివరాలను addlcophqrs4@gmail.com ఈ-మెయిల్ చిరునామాకు ఈ నెల 30వ తేది 5 గంటల్లోపు పంపించాలని, మరిన్ని వివరాలకు సైదాపేటలోని గ్రేటర్ చెన్నై హోం గార్డ్ కార్యాలయం 9566776222 అనే నెంబరు సంప్రదించవచ్చని నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రధాని మోదీకి ఈపీఎస్ కృతజ్ఞతలు

వాషర్‌మెన్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పరమకుడి-రామనాథపురం మధ్య నాలుగు రోడ్ల రహదారి ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీకి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... పరమకుడి-రామనాథపురం మధ్య 46.7 కి.మీ రహదారి విస్తరణకు కేంద్ర మంత్రివర్గ ఆమోదం తెలుపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ పథకంలో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రయాణికులభద్రత, దక్షిణ తమిళనాడు అభివృద్ధి, ముఖ్యంగా రామేశ్వరం ఆధ్యాత్మిక ప్రాంతానికి వచ్చే పర్యాటకులు, భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఈపీఎస్ పేర్కొన్నారు.

హొగెనేకల్‌లో ఏడో రోజు స్నానాలకు నిషేధం

వాషర్‌మెన్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్ జలపాతాల వద్ద పర్యాటకుల స్నానాలు చేసేందుకు ఏడో రోజైన బుధవారం కూడా అధికారులు నిషేధం విధించారు. కర్ణాటక డ్యాంల నుంచి వస్తున్న జలాలు పిల్లిగుండు మీదుగా హొగెనేకల్‌కు చేరుకుంటున్నాయి. దీంతో, హొగెనేకల్ జలపాతాల వద్ద వరద ఉధృతి అధికంగా ఉంది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతాల వద్ద పర్యాటకుల స్నానాలకు ఏడవ రోజు కూడా నిషేధం విధించారు. నిబంధనలు అతిక్రమించి జలపాతాల వద్దకు పర్యాటకులు వెళ్లకుండా ఆ ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తుకు ఉంచినట్లు అధికారులు తెలిపారు.

వ్యభిచారం సాగిస్తున్న మహిళ అరెస్ట్

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేటలోని ఓ ఇంట్లో వ్యభిచారం సాగిస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. మసూది పల్లంలోని ఓఇంట్లో వ్యభిచారం జరుగుతోందని వ్యభిచార నిరోధక విభాగం పోలీసులకు సమాచారం అందింది. దీంతో, మంగళవారం రాత్రి ఆ ఇంట్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి వెస్ట్ సైదాపేటకు చెందిన భువనేశ్వరి (53) అనే మహిళను అరెస్ట్ చేసిన పోలీసులు, ఆ ఇంట్లో ఇద్దరు మహిళలను రక్షించి ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

మామను బెదిరించిన అల్లుడి...

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా ముక్కూడల్ ప్రాంతంలో హత్యచేస్తానని మామను బెదిరించిన అల్లుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముక్కూడల్‌కు చెందిన సహాయ డేవిడ్ (25) జెర్సియా (24) దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా విడిపోయారు. గత నెల 29వ తేదీ జెర్సియా తండ్రి స్టీఫెన్ (50) ఇంటిముందు నిల్చున్న సమయంలో అక్కడికి వెళ్లిన సహాయ డేవిడ్ ఇంటితలుపులు ధ్వంసంచేసి కత్తితో బెదిరించినట్లు స్టీఫెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఎస్ఐ గణేశన్ కేసు నమోదు చేసి విచారణ జరిపి మంగళవారం సాయంత్రం అల్లుడు సహాయడేవిడ్‌ను అరెస్ట్ చేశారు.

తంజావూరు-విక్రవాండి మధ్య టోల్‌గేట్ ప్రారంభం

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తంజావూరు-విక్రవాండి జాతీయ రహదారి పథకంలో రెండో విడతగా షోళపురం నుండి సేతియాతోపు రహదారిలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్ బుధవారం ప్రారంభమైంది. తంజావూరు-విక్రవాండి జాతీయ రహదారి పథకంలో తంజావూరు నుండి షోళపురం వరకు, షోళపురం నుండి సేతియాతోపు వరకు, సేతియాతోపు నుండి విక్రవాండి వరకు మూడు విభాగాలుగా జాతీయ రహదారులశాఖ ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తొలివిడతగా తంజావూరు-షోళపురం వరకు 48.3 కిలోమీటర్ల మార్గంలో పనులు పూర్తిచేసి, జనవరి 20 నుండి వాహనాల రాకపోకలను అనుమతించారు. ఇందుకోసం వేంబకుడి ప్రాంతంలో టోల్‌గేటు ఏర్పాటు చేశారు. షోళపురం నుండి సేతియాతోపు వరకు గల 50 కిలోమీటర్ల రహదారిలో మూడు బైపాస్ రోడ్లు, నాలుగు ఫైఓవర్లు వున్నాయి. ఇందుకోసం షోళపురం సమీపంలోని మానంబాడిలో ఏర్పాటు చేసిన టోల్‌గేటు ద్వారా వాహనాలకు పన్ను వసూలవుతోంది. ఈ టోల్‌గేట్ మీదుగా పైనుంచే కార్లు, వ్యాన్లు, బస్సులు, లారీలు, ట్రెయిలర్ లారీలకు సంబంధించి టోల్ పన్ను వివరాలను రహదారుల కమిషన్ విడుదల చేసింది. ఇదిలా వుండగా సేతియాతోపు నుండి విక్రవాండి వరకు చేపట్టిన రోడ్డు పనులను ఈ నెలాఖరులోపు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.



తంజావూరు-విక్రవాండి మధ్యవున్న టోల్‌ప్లాజా

6న టీవీకే ఆధ్వర్యంలో ధర్నా

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో మృతిచెందిన వాచ్‌మన్ అజిత్‌కుమార్‌కు న్యాయం జరగాలని కోరుతూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో ఈ నెల 6న ధర్నా నిర్వహించనున్నారు. ఆదివారం చేపాక్ శివానందరోడ్డులో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ధర్నాలో టీవీకే జిల్లా స్థాయి నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొంటారని పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

● కమిషనర్ అక్రమార్జన కేసులో....

కుమార్తె నర్సింగ్ హోంలో ఏసీబీ తనిఖీలు

తిరుత్తణి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా అల్లినగరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న యేసురాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టాడని అందిన సమాచారం ఆధారంగా ఆయనకు సంబంధించిన ఆస్తులపై గత రెండ్రోజులుగా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యం ఆయన కుమార్తె, అల్లుడు తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో నివసిస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరు డాక్టర్లు కావడంతో వారింటివద్దే నర్సింగ్ హోం నడుపుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఏసీబీ సీఐ తమిళాచి నేతృత్వంలోని ఐదుగురు అధికారులు వారి ఆస్పత్రిలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఆస్తులకు సంబంధించిన పత్రాలను, దస్తావేజులను పరిశీలించారు. దాదాపు 5 గంటలపాటు నిర్వహించిన అనంతరం డాక్టర్ గ్రేసీని ఆమె తండ్రి యేసురాజ్‌కు సంబంధించిన కొన్ని ప్రశ్నలు అడిగి అధికారులు వారివద్దనుండి కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సీఎం గారూ లాకప్‌డెత్‌పై సారీ చెబితే సరిపోతుందా?

● అన్నాడీఎంకే, బీజేపీ ధర్నా

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు చిత్రహింసలు పెట్టి హత్యచేసిన వ్యవహారంలో మృతుడి కుటుంబానికి సారీ చెబితే సరిపోతుందా? అని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను అన్నాడీఎంకే-బీజేపీ నేతలు ప్రశ్నించారు. శివగంగ జిల్లా తిరుభువనం పోలీస్‌స్టేషన్‌కు విచారణ కోసం తీసుకెళ్లిన అజిత్‌కుమార్ పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి మరణించిన విషయం తెలిసిందే. అజిత్‌కుమార్ మృతితో సంబంధాలున్న అధికార పార్టీకి చెందిన వారిని అరెస్టు చేయాలని అన్నాడీఎంకే-బీజేపీ-టీఎంసీ-పీఎంకే, డీఎండీకే తదితర పార్టీ డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అజిత్‌కుమార్ కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం శివగంగ జిల్లా తిరుభువనంలో అన్నాడీఎంకే-బీజేపీ సంయుక్తంగా ధర్నా నిర్వహించాయి. ఇందులో అన్నాడీఎంకే నుంచి మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ, అజిత్‌కుమార్ హత్యపై సారీ చెబితే అతని కుటుంబానికి ఆయనలేని లోటు తీరుతుందా? అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే హెచ్‌రాజా, అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రాజన్‌చల్లప్ప, పెరియపుల్లాన్, మాజీమంత్రి భాస్కరన్‌తో పాటు రెండు పార్టీల నిర్వాహకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని డీఎంకే పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ధర్నాలో మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హెచ్‌రాజా తదితరులు

బైకును ఢీకొన్న లారీ

ఎనిమిదో తరగతి విద్యార్థి మృతి

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా మన్నార్గుడి వద్ద మోటారు బైకును లారీ ఢీకొనటడంతో 13 యేళ్ళ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. మన్నార్గుడి రావణన్‌కుట్టై వీధిలో నివసిస్తున్న శివగణేష్ కేబుల్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన కుమారుడు అమరేష్ అక్కడే ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం శివగణేష్ తన కుమారుడు అమరేష్‌ను తీసుకుని బైకులో పాఠశాలకు బయలుదేరాడు. మన్నార్గుడి రుక్మిణికుళం రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో బైకులో ప్రయాణించిన శివగణేష్, అమరేషన్ రోడ్డుపై పడ్డారు. అదే సమయంలో అమరేష్‌పై లారీ చక్రాలు వెల్లడంతో అక్కడిక్కడే మరణించాడు. శివగణేష్ తీవ్రంగా గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం మన్నార్గుడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మన్నార్గుడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


అమరేష్ (ఫైల్‌ఫొటో)

వడివేలు కామెడీ....! ట్యాంకర్ పైప్‌కు అడ్డంగా నిలిచిన మందు బాబు

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఓ చిత్రంలో హాస్యనటుడు వడివేలు వాటర్ ట్యాంకర్ నుంచి కారుతున్న నీటికి అడ్డంగా నిలబడిన సన్నివేశం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. అలాంటి ఘటన నామక్కల్ జిల్లా పల్లిపాళయంలో చోటుచేసుకుంది. పల్లిపాళయంలో రోడ్డుపై వెళుతున్న వాటర్ ట్యాంకర్ హఠాత్తుగా మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో, డ్రైవర్ మెకానిక్‌ను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. ఆ సమయంలో పీకలదాకా మద్యం తాగిన ఓ వ్యక్తి, ట్యాంకర్ పైప్‌లైన్ కొళాయి తిప్పి నీటిలో స్నానం చేస్తూ డాన్స్ చేశాడు. రోడ్డంతా నీరు చేరడంతో వాహన చోదకులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో, కొళాయి కట్టేందుకు వీలుకాకపోవడంతో ఆ వ్యక్తి కొళాయికి అడ్డుగా నిలబడ్డాడు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు, కొళాయి కట్టివేసి అతడిని హెచ్చరించి పంపించారు.


లారీ పైప్‌కి అడ్డుగా నిలబడిన మందు బాబు

పోలీసుల విచారణ పారదర్శకంగా ఉండదు

● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోవున్న అన్ని రాష్ట్రాల్లో పోలీసుల విచారణ పారదర్శకంగా ఉండదని డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. శివగంగ జిల్లా తిరుభువనం పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందిన అజిత్‌కుమార్ కుటుంబ సభ్యులను తిరుమావళవన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన అజిత్‌కుమార్ చిత్రపటానికి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, లాకప్‌డెత్‌లు అనేవి అన్ని రాష్ట్రాల్లో జరుగుతుంటాయని, ముఖ్యమంత్రిగా ఎవరున్నప్పటికీ ఈ మరణాలు జరుగుతాయన్నారు. తనకు తెలిసినంత వరకు పోలీసుల విచారణ పారదర్శకంగా ఉండదన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి చరిత్ర గురించి తెలుసుకోకుండా చిత్రహింసలు పెట్టడం వల్లే అజిత్ కుమార్‌తో పాటు రాష్ట్రంలో ఇప్పటివరకు 25 మంది పోలీస్‌స్టేషన్లలో మృతిచెందారని తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఖాకీలే రౌడీల్లాగా చలామని అవుతున్నారని గతంలో సుప్రీం కోర్టు తన అభిప్రాయాన్ని వెల్లడించిందని, ఒక కేసు విచారణ ఎలా ఉండాలన్న దానిపై 11 సూచనలు కూడా అత్యున్నత న్యాయస్థానం విడుదల చేసిందన్నారు. అయితే సుప్రీంకోర్టు సూచనలను ఏ పోలీస్‌స్టేషన్‌లో కూడా పాటించడంలేదని, అజిత్‌కుమార్ పట్ల హద్దులు దాటిన పోలీసులను కఠినంగా శిక్షించాలని తిరుమావళవన్ డిమాండ్ చేశారు.

గుంతలో పడిన మినీ లారీ



పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మినీ వాటర్ లారీ గుంతలో పడిన ఘటనలో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. రామనాథపురం జిల్లా మండపం ఉత్తర మండపం వాటి ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రం తీరానికి వెళ్లేందుకు వంతెన ఉంది. ఈ వంతెనపై మంగళవారం సాయంత్రం హఠాత్తుగా పెద్ద గొయ్యి ఏర్పడింది. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ వాటర్ ట్యాంకర్ లారీ గొయ్యిలో పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో తప్పించుకున్నారు. ఈ కారణంగా హార్బర్ తీరంలో పడవల్లోకి సామగ్రి తీసుకెళ్లేందుకు జాలర్లు ఇబ్బందులు పడ్డారు. అనంతరం క్రేన్ సాయంతో లారీని గొయ్యి నుంచి బయటకు తీశారు.

రైలు ఛార్జీల పెంపు అంగీకరించం

● మదురై ఎంపీ వెంకటేశన్



పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రైలు ఛార్జీలు తక్కువగా పెంచడం కంటి తుడుపు చర్య మాత్రమేనని, ఆ పెంపును అంగీకరించమని మదురై సీపీఎం ఎంపీ ఎస్.వెంకటేశన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... రైళ్లలో సబర్బన్ రైళ్ల ఛార్జీలు, సీజన్ టిక్కెట్ల ఛార్జీలు పెంచలేదన్నారు. కి.మీ అర పైసా, పైస, 2 పైసలు ఛార్జీలు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ, వాస్తవ పరిస్థితులు ఇలా ఉన్నాయన్నారు. 2017-18లో 824 కోట్లు, 2018-19లో 846 కోట్లు, 2018-19లో 846 కోట్ల మంది రైళ్లలో ప్రయాణించగా, రూ.45,000 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. కానీ, 2024-25లో ప్రయాణికుల సంఖ్య 715 కోట్లకు తగ్గిందని, అదే సమయంలో ఆదాయం మాత్రం రూ.45వేల కోట్ల నుంచి రూ.75వేల కోట్లకు పెరిగిందని, ఇందులో ఉన్న రహస్యం ఇదేనని తెలియజేశారు. ముందస్తు రిజర్వేషన్లు 68 కోట్ల నుంచి 81 కోట్లకు చేరుకోగా, అన్ రిజర్వ్‌డ్ ప్రయాణికుల సంఖ్య 778 కోట్ల నుంచి 634 కోట్లకు తగ్గిందన్నారు. ఈ ఆదాయం లోటును ఎలా భర్తీచేయాలి? అని ఆలోచించి, తత్కాల్, ప్రీమియం తత్కాల్, డైనమిక్ ఛార్జీలంటూ ప్రతి బోగీకి 30 శాతం కేటాయించారని తెలిపారు. ఈ టిక్కెట్లు రూ.500లకు బదులు రూ.3వేలకు విక్రయిస్తున్నారన్నారు. వందే భారత్, శతాబ్ధి, అంత్యోదయ రైళ్లలో ఛార్జీలు పెంపు అమలుచేశారన్నారు. అన్ రిజర్వ్‌డ్ బోగీల తగ్గింపు, సాధారణ రైళ్ల రద్ద కారణంగా ప్రయాణికుల సంఖ్య తగ్గినప్పటికీ ఆదాయం పెరుగుతుందన్నారు. రహస్య ఛార్జీల పెంపు ద్వారా ప్రయాణికులను రోడ్డు పైకి నెటడం జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమని, ఛార్జీల పెంపు ద్వారా రూ.75వేల కోట్లు ఆదాయం పొందుతున్న రైల్వేలు, కంటి తడుపు చర్యగా ఛార్జీలు పెంచడం అంగీకరించలేమని ఎంపీ తెలిపారు.

వాహన చోదకుల నుంచి నగదు వసూలు

● ఎస్ఐ, కానిస్టేబుల్ సస్పెన్షన్

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకుల నుంచి నగదు వసూలుచేస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటుపడింది. నీలగిరి జిల్లా కున్నూర్ నుంచి మైసూరు వెళ్లే జాతీయ రహదారిలో కడలూరు పోలీసులు గస్తీ నిర్వహిస్తుంటారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి నీలగిరి వచ్చే పర్యాటకులు, సరుకుల వాహనాల నుంచి గస్తీ పోలీసులు నగదు వసూలుచేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, పర్యాటకుల వాహనాల నుంచి ఎస్ఐ సులేమాన్, కానిస్టేబుల్ వినోద్ నగదు తీసుకునే దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి ఎస్ఐ, కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ నిషా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కూడన్‌కుళంలో బీడీ ఆకు, శొంఠి స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళంలో పడవలో అక్రమంగా తరలిస్తున్న బీడీ ఆకులు, శొంఠిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కూడన్‌కుళం సముద్రతీరంలో అనుమానాస్పదంగా నిలిపిన పడవలో పోలీసులు తనిఖీ చేశారు. అందులో 30 కిలోల బీడీ ఆకుల బండిళ్లు, 25 కిలోల సొంఠి బస్తాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పడవలో ఉన్న కూత్తంకుళి, కన్నియాకుమారికి చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీటిని శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్నారా? అంటూ పోలీసులు విచారిస్తున్నారు.

కోవై కలెక్టర్ కార్యాలయానికి మళ్లీ బాంబు బెదిరింపు

వాషర్‌మెన్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి మళ్లీ బాంబు బెదిరింపు వచ్చింది. కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన లేఖలో... కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం, కారు పార్కింగ్ స్థలాల్లో బాంబులు ఉంచినట్లు, అవి త్వరలో పేలుతాయని రాసి ఉంది. కార్యాలయ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసు జాగిలం, బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, కార్యాలయం, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీచేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. కొద్దిరోజుల క్రితం కలెక్టర్ కార్యాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది.

స్టేషన్‌లో మహిళా ఎస్ఐ మృతి

వాషర్‌మెన్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో మహిళా ఎస్ఐ మృతిచెందిన ఘటన నామక్కల్ జిల్లాలో చోటుచేసుకుంది. నామక్కల్ ప్రత్యేక ఎస్ఐగా పనిచేస్తున్న కామాక్షి, బుధవారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని బాత్రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ ఆమె బయటకు రాకపోవడంతో అనుమానించిన స్టేషన్ సిబ్బంది, తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి స్పృహతప్పి పడి ఉన్న కామాక్షిని చూసి దిగ్భ్రాంతి చెంది సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కామాక్షి గుండెపోటుతో మృతిచెందారా? మరేదైనా కారణంగా ఉందా? అంటూ రాశిపురం డీఎస్పీ విజయకుమార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు.

వస్త్ర వ్యాపారి కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

అడయార్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూరు ప్రాంతానికి చెందిన గాండీబన్ (38) అనే వస్త్ర వ్యాపారిని కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను నగర పోలీసులు అరెస్టు చేశారు. త్రిశూలం ప్రాంతానికి చెందిన రంజిత్ (30) అనే వ్యక్తికి, గాండీబన్‌కు వ్యాపారంలో పోటీ ఉంది. ఈ క్రమంలో రంజిత్‌కు గాండీబన్ రూ.30 వేలు బాకీ డబ్బులు ఇవ్వాల్సివుంది. ఈ డబ్బు ఇవ్వాలంటూ పలుమార్లు రంజిత్ అడిగినప్పటికీ గాండీబన్ ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన రంజిత్ రెండు రోజుల క్రితం తన స్నేహితుడు మోహన్ రాజ్ సహకారంతో గాండీబన్‌ను కిడ్నాప్ చేసి, అతనివద్ద ఉన్న రూ.31 వేలు బలవంతంగా తీసుకుని పంపించి వేశారు. దీనిపై గాండీబన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు.. రంజిత్, మోహన్‌రాజ్‌లను అరెస్టు చేశారు.

విద్యుత్ ఛార్జీలు పెంచడం సబబు కాదు

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలపై మరింత ఆర్థిక భారం మోపేలా విద్యుత్ ఛార్జీలు పెంచడం సరికాదని, ప్రభుత్వం దీనిని తక్షణం వాపసు తీసుకోవాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ ఛార్జీలు పెంచే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ముఖ్యమంత్రి స్టాలిన్ హామీ ఇచ్చారని, ఇప్పటికే ధరల పెంపుతో తల్లడిల్లుతున్న పేద,మధ్య తరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారం మోపేలా రాష్ట్రంలో మంగళవారం అర్ధరాత్రి నుండి విద్యుత్ ఛార్జీలను పెంచారని ఆరోపించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

9కి పెరిగిన శివకాశి బాణసంచా మృతుల సంఖ్య

ఐసిఎఫ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా సాత్తూర్ సమీపంలో బాణసంచా కర్మాగారంలో మంగళవారం జరిగి పేలుడు ప్రమాదంలో 8 మంది మృత్యువాతపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న లింగుస్వామి బుధవారం సాయంత్రం మృతిచెందారు. ఈ ఘటనలో గాయపడి శివకాశి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

హత్యకు దారి తీసిన అనుమానం

● భర్తను చంపి తెల్లారేవరకు శవంతోనే ఉన్న భార్య

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తను హతమార్చిన భార్య రాత్రంతా భర్త శవంతో గడిపిన సంఘటన కడలూరు జిల్లా నైవేలిపట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు నైవేలి పంచాయతీ బీ2-బ్లాక్‌లో ఎన్ఎల్‌సీ నుంచి పదవీవిరమణ పొందిన కొలంజియప్పన్ (63) నివశిస్తున్నారు. ఆయన భార్య మరణించడంతో భర్తకు దూరమైన పద్మావతి (55) అనే మహిళను 20ఏళ్ళ కి్రతం వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో, మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని ఆరోపిస్తూ కొలంజియప్పన్‌పై పద్మావతి నెల రోజుల క్రితం నైవేలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో భార్యాభర్తలు తరచూ గొడవలు పడుతుండేవారని తెలిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి గాఢనిద్రలోవున్న కొలంజియప్పన్ గొంతును పద్మావతి కత్తితో కోయడంతో అతడు మృతిచెందినట్లు తెలిసింది. భర్త శవం వద్ద పద్మావతి ఉదయం వరకు ఉన్నట్టు పోలీసులకు ఇచ్చిన వాగ్మూలంలో తెలిపింది. ఆమెను అరెస్టు చేసి బుధవారం ఉదయం కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.


విచారణ జరుపుతున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో నిందితురాలు పద్మావతి

నేడు, రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

గిండీ: డిఫెన్స్ కాలనీ 1 నుంచి 16 వీధులు, సుందర్ నగర్, నందంబాక్కం మంగాలిఅమ్మన్ ఆలయ వీధి, కలైంజర్ నగర్, గణపతి కాలనీ, రాజ్ భవన్, మౌంట్ రోడ్డు కొంత భాగం, సర్దార్ పటేల్ రోడ్డు, ముగలివాక్కం, కమల నగర్, శబరి నగర్ ఎక్స్‌టెన్షన్, ఆలందూర్-ముత్యాల రెడ్డి వీధి, వేదగిరి వీధి, మార్గో వీధి, పరుత్తివాక్కం వీధి, వేళచ్చేరి రోడ్డు, ఎంకేఎన్ రోడ్డు, పోలీసు క్వార్టర్స్.

కేకే నగర్: వలసరవాక్కం, జానకి నగర్, ప్రకాశం రోడ్డు కొంత భాగం, అళగిరి నగర్, భక్తవత్సలం కాలనీ, చూలైమేడు, గిల్ నగర్, తిరువళ్లువర్‌పురం, దశరథపురం, అన్నామలై కాలని, కేకే నగర్ సౌత్, అశోక్ పిల్లర్ రోడ్డు, శాలిగ్రామం, శ్రీ రామర్ వీధి కొంత భాగం.

మైలాపూర్: లజ్ చర్చ్ రోడ్డు, ఈస్ట్ అభిరామపురం 1 నుంచి 3 వీధులు, వారెన్ రోడ్డు, పీఎస్‌కే గార్డెన్స్, కెనాల్ బాంక్ రోడ్డు, దేశిక రోడ్డు, వెంకటేశ్వర అగ్రహారం, రాయపేట హైరోడ్డు కొంత భాగం, కట్చేరి రోడ్డు, రంగనాధపురం వీధి, సోనాచలం వీధి, నాచియప్పన్ వీధి. **మడిపాక్కం:** లక్ష్మీ నగర్, కుబేరన్ నగర్ 12వ వీధి, మూవవసన్‌పేట, రాఘవ నగర్ కొంత భాగం, అన్నా వీధి, మేడవాక్కం మెయిన్ రోడ్డు, పుళిదివాక్కం, బాలయ్య గార్డన్ కొంత భాగం, రాజీ వీధి, మురుగప్పన్ వీధి, వానువంపేట, సరస్వతి నగర్, ఏజీఎస్ కాలని, టీజీ నగర్, నంగనల్లూర్, వీర రాఘవన్ వీధి. **తాంబరం:** మాడంబాక్కం అగరం మెయిన్ రోడ్డు, మప్పేడే, సెక్రటరియేట్ కాలని, అన్నై థెరిస్సా వీధి, తిరువాంచేరి గ్రామం, రూబి రెసిడెన్షియల్, శ్రీ సాయి నగర్, భాయ్ గార్డన్, రాజకీల్పాక్కం, చిట్లపాక్కం మెయిన్ రోడ్డు, మెహతా నగర్, బాబు వీధి, శ్రీరామ్ నగర్, బాలాజి అవెన్యూ.

శుక్రవారం:

మాంగాడు: కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు, వెల్లీశ్వరర్ ఆలయ వీధి, ఎస్ఎస్ ఆలయ వీధి, స్కూల్ వీధి, ఎంజీఆర్ నగర్, వెల్లీశ్వరర్ నగర్, ఈస్ట్ కామాక్షి నగర్, నరివన రోడ్డు, రామకృష్ణ అంబాళ్ నగర్, ఆడిసన్ నగర్, బాలాజీ అవెన్యూ, అంబాళ్ నగర్, పాండియన్ నగర్.

సోమంగళం: సోమంగళం, డీసీ నగర్, శక్తి నగర్, పూంనతండలం, పుదుపేడుమేడు, పుదుపేడు పల్లం, నాడువీరపట్టు గాంధీ నగర్, నాడువీరపట్టు రాంజీ నగర్, తాంబరం మెయిన్ రోడ్డు, నల్లూరు, తిరుపతి నగర్.

ఆలందూర్: ఎంకేఎన్ రోడ్డు కొంత భాగం, మాదురై వీధి, మధువాంకరై 1,2,3,5 వీధులు, రామస్వామి బందల్ వీధి, జాల్ నైకర్ వీధి, ధర్మరాజ ఆలయ వీధి, అప్పావు ముదాలి వీధి, నాధం సుబీర్ వీధి, గురుబాక్ వీధి, అజర్ ఖానా వీధి, లక్షర్ వీధి, ముత్తమజి వీధి, గాజి సాహెబ్ వీధి, ఇబ్రహీం వీధి. **ఆదంబాక్కం:** సెంగాళి అమ్మన్ వీధి, శ్రీనివాసన్ వీధి, భారతియార్ వీధి, సెల్వగణపతి వీధి, ద్రౌపతి అమ్మన్ ఆలయ వీధి, మేడవాక్కం మెయిన్ రోడ్డు, పార్తీబన్ వీధి, రాజలక్ష్మి వీధి, సభాపతి వీధి, తిరువళ్లువర్ వీధి, కుంభర్ వీధి, మణిమేఘలై వీధి, గజలక్ష్మి వీధి, థామస్ నగర్, ఉష నగర్ 1,2,3 వీధులు, వేంబులి అమ్మన్ ఆలయ వీధి, సత్యనారాయణ వీధి, గోపినాధ్ నగర్.

షోలింగనల్లూర్: శేఖరన్ మాల్, కైలాష్ నగర్, శ్రీ పెరుమాళ్ నగర్, అంతోని నగర్, భజన ఆలయ వీధి, పెరుంబాక్కం, నూక్కంపాళయం రోడ్డు, మైలై బాలాజి నగర్ పార్ట్-1,2,3,4, తండై పెరియార్ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, కైవేలి నుంచి కామాక్షి ఆసుపత్రి వరకు, గ్రీన్ కోర్టు, అన్నాసాలై మెయిన్ రోడ్డు, జగన్నాధపురం, రైస్ మిల్ మెయిన్ రోడ్డు, జయచంద్రన్ నగర్, అత్తిపాది గార్డన్, అసన్ కాలేజ్ రోడ్డు, నేతాజి నగర్, పిళ్లయార్ ఆలయ వీధి, దేవి కరుమారిఅమ్మన్ వీధి.

కేకే నగర్: కన్నికాపురం 1 నుంచి 3 వీధులు, విజయ రాఘవపురం 1 నుంచి 5 వీధులు మరియు క్రాస్ వీధి, మీరన్‌సాహిబ్ వీధి, రాజమన్నార్ రోడ్డు కొంత భాగం, సత్య గార్డన్స్, శాస్త్రా కాలేజ్, ఏవీఎం అశ్రా, ఏవీఎం స్టూడియో, కాపెల్లా పార్ట్ ఆఫ్ ఆర్కాడ్ రోడ్డు, కుమరన్ కాలని మెయిన్ రోడ్డు, సాలిగ్రామం, 80 అడుగుల రోడ్డు కొంత భాగం, రాణి అన్నా నగర్, పీటీ రాజన్ రోడ్డు కొంత భాగం, కేకే నగర్ 14,15 సెక్టార్లు (94 నుంచి 104 వీధులు), ఎస్ఎస్‌బీ నగర్, ఎస్వీ లింగం రోడ్డు, అళగర్ పెరుమాళ్ ఆలయ వీధి, విజయ వీధి, ఓట్టగపాళయం.

అంబత్తూర్ (పొన్నియమ్మన్ నగర్): గాలెక్సీ రోడ్డు, పెరియార్ వీధి, శివపాదం వీధి.

కామెడీ చిత్రాలు తీయడం సులభం కాదు

● ఆర్‌కే సెల్వమణి



కామెడీ చిత్రాలను రూపొందించడం అంత ఈజీ కాదని, అందుకే తన చిత్రాల్లో హాస్యపు సన్నివేశాలుండవని ప్రముఖ దర్శకుడు ఆర్‌కే సెల్వమణి అన్నారు. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు ఎళిల్ తన కొత్త చిత్రంలో పది మంది దర్శకులకు నటించే అవకాశం ఇచ్చినట్టుగానే ఆయన రూపొందించే తదుపరి చిత్రాల్లో పది మంది నిర్మాతలకు అవకాశాలివ్వాలి. దర్శకుడు ఎళిల్ కాలానుగుణంగా తనను తాను మార్చుకుని, ప్రేక్షకుల అభిరుచికి తగిన విధంగా సినిమాలు అందించగల ప్రతిభావంతుడు. ప్రేక్షకులకు కథ నచ్చితేనే సినిమా చూస్తారు. ఒక సినిమా విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు.

'పరందు పో' చూసి ప్రేక్షకులు నవ్వుతూ బయటకొస్తారు: మిర్చి శివ



దర్శకుడు రామ్‌తో మిర్చి శివ

రామ్ దర్శకత్వంలో రూపొందిన 'పరందు పో' చిత్రం ప్రేక్షకులను ఏమాత్రం నిరాశపరచదని, ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులంతా నవ్వుకుంటూ థియేటర్ నుంచి బయటకు వస్తారని ఆ సినిమా హీరో మిర్చి శివ అన్నారు. జియో హాట్‌స్టార్, జీకేఎస్ ప్రొడక్షన్స్, సెవెన్ సీస్, సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఫీల్ గుడ్ మూవీ 'పరందు పో' ఈ నెల 4వ తేదీ విడుదలకానుంది. ఈ సినిమా గురించి హీరో మిర్చి శివ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం దర్శకుడు రామ్ నన్ను పిలిచినపుడు ఆశ్చర్యపోయాను. నటీనటుల నుంచి తనకు కావాల్సింది రాబట్టుకునే దర్శకుడు రామ్. ప్రతి ఒక్కరిని ఈ సినిమా మెప్పిస్తుంది' అన్నారు. కాగా, మిర్చి శివ, అంజలి జంటగా నటించిన ఈ చిత్రంలో గ్రేస్ ఆంటోనీ, మాస్టర్ మిథున్ ర్యాన్, అజు వర్గీస్, విజయ్ యేసుదాస్ తదితరులు నటించారు. ఈ మూవీకి కెమెరా ఎన్‌కే ఏకాంబరం, ఎడిటర్ మధి వీఎస్, సంగీతం సంతోష్ దయానిధి.

ఫెప్సీ, నిర్మాతల మండలి మధ్యవర్తిగా రిటైర్డ్ జడ్జి


● మద్రాస్ హైకోర్టు ఆదేశం

చిత్రజ్యోతి

తమిళనాడు సినీ నిర్మాతల మండలి, దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సమాఖ్య (ఫెప్సీ) మధ్య సమస్యల పరిష్కారం కోసం రిటైర్డ్ జడ్జి గోవిందరాజ్‌ను మద్రాస్ హైకోర్టు నియమించింది. నిర్మాతల మండలితో ఫెప్సీ ఉన్న ఒప్పందం మార్చి 2025తో ముగిసిపోయింది. దీంతో కొత్తగా సినీ నిర్మాణ కార్మికుల సంఘాన్ని చిత్ర నిర్మాతల మండలి కొత్తగా ఏర్పాటు చేసింది. దీంతో నిర్మాతల మండలి చిత్రాల నిర్మాణాలు ఫెప్సీ కార్మికులు సహకరించడం లేదు. దీంతో చిత్రాల నిర్మాణాలకు తీవ్ర ఆంటకం కలుగుతుందని పేర్కొంటూ సినీ నిర్మాతల మండలి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై పలుమార్లు విచారణ జరుగగా, తుది తీర్పు బుధవారం వెలువడింది. ఫెప్సీ, నిర్మాతల మండలికి మధ్య ఉన్న సమస్యల పరిష్కారం కోసం రిటైర్డ్ న్యాయమూర్తి గోవిందరాజ్‌ను నియమించేందుకు ఇరు వర్గాలు సమ్మతించడంతో మధ్యవర్తిగా రిటైర్డ్ జడ్జిని నియమించింది. అదేసమయంలో నిర్మాతల మండలిలో సభ్యులైన నిర్మాతలు నిర్మించే చిత్రాలకు ఫెప్సీ కార్మికులు సహకరించాలన్న వినతిని హైకోర్టు తోచిపుచ్చింది.



1న జీవీ ప్రకాష్ 'బ్లాక్ మెయిల్' విడుదల



'బ్లాక్ మెయిల్'లో జీవీ ప్రకాష్

ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బ్లాక్ మెయిల్' ఆగస్టు ఒకటో తేదీ విడుదల చేయనున్నారు. 'ఇరవుక్కు ఆయిరమ్ కణ్‌గల్', 'కణ్‌గళై నంబాదే' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ము.మారన్ ఈ మూవీ రూపొందించారు. జేటీఎస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై జయకొడి అమల్‌రాజ్ నిర్మించారు. తేజు అశ్విన్ హీరోయిన్‌గా నటించగా, ఇతర పాత్రల్లో శ్రీకాంత్, బిందుమాధవి, వేట్టై ముత్తుకుమార్, రెడిన్ కింగ్‌స్లీ, రమేష్ తిలక్, హరిప్రియ తదితరులు నటించారు.

చిదంబరంలో వైభవంగా తిరుమంజనం



నటరాజమూర్తికి మహాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

● నటరాజస్వామికి మహాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శివకామ సుందరి సమేత నటరాజస్వామి

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కడలూరు ఇల్లా చిదంబరంలో ప్రసిద్ధిగాంచిన నటరాజస్వామి ఆలయంలో ఆణినెల తిరుమంజనం ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రధానాంశమైన మహాభిషేకం బుధవారం ఉదయం ఆలయ అర్చక బృందం శాస్త్రోక్తం నిర్వహించింది. చిదంబరం క్షేత్రంలో ఆనంద తాండవమాడిన నటరాజమూర్తికి తమిళ ఆణిమాసంలో ప్రత్యేకంగా తిరుమంజనం ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆ రీతిలో గత నెల 23న ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం కాగా, ప్రతి రోజు పంచమూర్తులను పల్లకీల్లో ఊరేగిస్తున్నారు. మంగళవారం రథోత్సవం జరిగిన నేపథ్యంలో, బుధవారం ఉత్సవాల సందర్భంగా వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల శివనామస్మరణల మధ్య పూజారులు మహాఅభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు.

7 నుంచి 'ఎబిలిటీ ఫెస్ట్-2025' ఫిల్మ్ ఫెస్టివల్



మీడియా సమావేశంలో రెహ్మాన్, రేవతి తదితరులు

అడయార్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీ నుంచి పదో తేదీ వరకు 'ఎబిలిటీ ఫెస్ట్-2025 ఇండియా ఇంటర్నేషనల్ డిజేబిలిటీ ఫిల్మ్ ఫెస్టివల్' జరగనుంది. ఎబిలిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఫిల్మ్ ఫెస్టివల్ వివరాలను బుధవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో జ్యూరీ మెంబర్లు సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్, నటి సిమ్రన్, గేయరచయిత, స్క్రీన్ రైటర్ మదన్ కార్గే, ఇంటర్నేషనల్ పారా స్విమ్మర్ మొహమ్మద్ షామ్స్ ఆలమ్ షేక్, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకుమార్ తదితరులు వెల్లడించారు. ఈవెంట్‌కు ఫెస్టివల్ డైరెక్టరుగా జయశ్రీ రవీంద్రన్, ఫెస్టివల్ చైర్‌పర్సన్ రేవతి వ్యవహరిస్తారు. 2005లో ప్రారంభించిన ఎబిలిటీ ఫెస్ట్ దేశంలో ఒక మార్గదర్శక కార్యక్రమంగా గుర్తింపు పొందింది. ఇపుడు తొమ్మిదో ఎడిషన్ ఫిల్మ్ ఫెస్ట్‌ను నిర్వహించనుంది.

విష్ణు కార్స్‌కు మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు



పురస్కారం అందుకుంటున్న విష్ణు గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ ఎండీ దీపా వెంకట్

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్ల వ్యాపారంలో లక్షలాది మంది కస్టమర్ల ఆదరణ పొందిన విష్ణు కార్స్ మరో ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని తన ఖాతాలో జమచేసుకుంది. చెన్నై జీఎస్టీ శాఖ ప్రకటించిన టాప్ టాక్స్ పేయర్, అత్యుత్తమ పారిశ్రామికవేత్తల విభాగాల్లో రెండు పురస్కారాలకు ఏకకాలంలో ఎంపికైన సంస్థగా నిలిచింది. టాప్‌టాక్స్ పేయర్‌గా విష్ణుకార్స్, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా విష్ణు గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ దీపా వెంకట్ ఎంపికయ్యారు. చెన్నై కలైవానర్ అరంగంలో 8వ సీజీఎస్టీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీఎస్టీ తమిళనాడు, పుదుచ్చేరి జోన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ రెండు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీయూఎంఐ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధరన్ రంగరాజన్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ డా. రామనివాస్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఏఆర్ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపా వెంకట్ మాట్లాడుతూ 15 యేళ్లుగా నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్‌ను రెండు విభాగాల్లో సీజీఎస్టీ వారు గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల ఆదరణ, సంస్థలో ఉద్యోగులందిస్తున్న సేవల కారణంగానే ఇది సాధ్యమైందని చెప్పారు.

'ఎక్స్ క్లాస్' ఇంజన్ ఆధునికీకరణ

● కున్నూర్‌లో ట్రయల్ రన్



పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కున్నూర్-మేట్టుపాళయం కొండ రైలులో, 73 సంవత్సరాల పురాతన 'ఎక్స్ క్లాస్' ఆవిరి ఇంజన్‌ను తక్కువ స్థాయి డీజిల్‌తో నడిపేలా ఆధునికీకరించగా, ఈ రైలు ట్రయల్ రన్ కున్నూర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆంగ్లేయుల పాలనలో 1899లో నీలగిరి కొండ రైలు అందుబాటులోకి వచ్చింది. శతాబ్దాలుగా బొగ్గుతో నడుస్తున్న ఎక్స్ క్లాస్ ఆవిరి యంత్రాలను 2002లో 'బర్నెస్' ఆయిల్‌తో నడిచేలా మార్పులు చేశారు. బర్నెస్ ఆయిల్ వినియోగాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిషేధించడంతో, సీనియర్ నిపుణులు మాణిక్యం నేతృత్వంలో కున్నూర్ వర్క్ షాప్‌లో ఎక్స్ క్లాస్ ఇంజన్‌ను డీజిల్‌తో నడిచేలా పరిశోధన చేపట్టారు. ఈ నేపథ్యంలో, 1952 నుంచి పనిచేస్తున్న '37392' నెంబరు కలిగిన ఎక్స్ క్లాస్ స్టీమ్ లోకోమోటివ్‌ను నిర్వహణ పనుల కోసం తిరుచ్చిలోని పొన్‌మలై వర్క్ షాప్‌కు ఆరు నెలల క్రితం తీసుకెళ్లి డీజిల్‌తో నడిచేలా పునరుద్ధరించారు. ఈ ఇంజన్‌ను లారీలో కున్నూర్‌కు తీసుకురాగా, ఇంజన్‌కు రెండు బోగీలు అనుసంధానం చేసి కున్నూర్-మేట్టుపాళయం మధ్య మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ విషయమై కోయంబత్తూర్ ఐఎస్‌ఏ ఇంజనీర్స్ సంస్థ ఇంజనీర్ సంపత్ మాట్లాడుతూ.. ఈ ఆధునికీకరించిన ఇంజన్‌లో, పైలట్ బర్నర్, నాజిల్, డీజిల్ సరఫరా ప్రధాన పైపులను ఒకే లైన్‌గా మార్చామన్నారు. ఈ రైలు డీజిల్ తక్కువ పరిమాణంతో నడుస్తుందని, డ్రైవర్లు సులభతరంగా ఆపరేట్ చేసేలా ఎలక్ట్రానిక్ వ్యవస్థ మార్చినట్లు ఆయన తెలిపారు.

ప్రారంభించి నెల దాటినా ...
నిరుపయోగంగా పెద్దకంచి మార్కెట్



కొత్త రూపు సంతరించుకున్న మార్కెట్

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పెద్ద కాంచీపురం వాసుల కోసం నెల రోజుల క్రితం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అట్టహాసంగా ప్రారంభించిన జవహర్‌లాల్ నెహ్రూ మార్కెట్ నిరుపయోగంగా మారడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. కాంచీపురంలో రూ.7 కోట్లతో నిర్మించిన రాజాజీ మార్కెట్ ప్రస్తుతం ఉపయోగంలో ఉంది. అయితే పెద్ద కాంచీపురం ప్రాంతానికి చెందినవారు ఆ మార్కెట్‌కు వెళ్ళి రావటం కష్టంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పెద్ద కాంచీపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ మార్కెట్‌ను పునర్నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు రూ.4.6 కోట్ల మేరకు నిధులు కేటాయించింది. ఈ మార్కెట్‌లో దిగువంతస్తులో 80 దుకాణాలున్నాయి. మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ సదుపాయం కూడా ఉన్నాయి. కొత్త హంగులు సమకూర్చుకున్న ఈ మార్కెట్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మే 30న అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభించి నెల రోజులు దాటినా ఈ మార్కెట్‌ను తెరవకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈ భవనలోని దుకాణాల గదులకు విద్యుత్ సరఫరా కల్పించని ఆ కారణంగా తాము దుకాణాలను నడిపేందుకు ఆసక్తికనబరచటం లేదని వ్యాపారులు తెలిపారు. ఈ విషయమై కాంచీపురం కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ గణేష్ మాట్లాడుతూ ఈ వారంలోగా ఈ మార్కెట్ వినియోగంలోకి వస్తుందని, ఆలోగా విద్యుత్ కనెక్షన్లు కూడా మంజూరవుతాయని తెలిపారు.



గ్రౌండ్ ఫ్లోర్‌లో మూతపడి ఉన్న దుకాణాలు

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో



మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాలు

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యాం వస్తున్న నీటి ప్రవాహం 56వేల ఘనపుటడుగుల నుంచి 35,500 ఘనపుటడుగులకు తగ్గింది. కర్ణాటక రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంల నుంచి అదనపు జలాల విడుదలను తగ్గించారు. బుధవారం గణాంకాల ప్రకారం డ్యాంలో నీటి మట్టం 120 అడుగుల చొప్పున 93.47 టీఎంసీలుగా ఉందని, ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా సీఎంకే రెడ్డి మనవరాలి వివాహం



చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు, ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి-నిర్మలమ్మ మనవరాలు, డాక్టర్ సీఎం కిషోర్-లీలాదేవిల కుమార్తె అశ్మిత-ఈవీపీ సంస్థల వారసుడు ఆకాష్‌ల వివాహ వేడుకలు నీలాంగరైలో బుధవారం వైభవంగా జరిగాయి. నూతన వధూవరులను రెండు కుటుంబాలు, బంధువులు, ఒంగోలు టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, తమిళనాడు ప్రభుత్వ కార్మిక శాఖ కార్యదర్శి వీరరాఘవరావు, ప్రముఖ సినీ నటుడు సుమన్, మంత్రి ఎస్‌ఎం.నాజర్, మాజీమంత్రి డి.జయకుమార్, తెలుగు ప్రముఖులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి, కె.అనిల్‌కుమార్‌రెడ్డి, ఈవీ పెరుమాళ్‌స్వామి రెడ్డి, ఎస్వీ సావిత్రి, నాయకర్ నందగోపాల్, నాగభూషణం, కేవీ జనార్థనం, గొల్లపల్లి ఇజ్రాయేలు, నేలటూరు విజయ్‌కుమార్, లయన్ వీజీ జయకుమార్, నిర్మల్ చందర్, ఎస్‌కేడీటీ పాఠశాలల టీచర్లు, కమిటీ సభ్యులుపాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు టెన్త్ రీ వాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఐసిఎఫ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల రీ వాల్యుయేషన్, రీ కౌంటింగ్ ఫలితాలు గురువారం మధ్యాహ్నం విడుదల కానున్నాయి. www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఫలితాలు విడుదల చేయనున్నట్లు, దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, వివరాలు లేకుండా మార్కుల్లో ఎలాంటి మార్పులు లేవని గమనించాలని ప్రభుత్వ పరీక్షల శాఖ తెలియజేసింది.

గ్రూప్-4 పరీక్షల హాల్ టిక్కెట్లు విడుదల

ఈ నెల 12న జరుగనున్న గ్రూప్-4 పరీక్షల హాల్ టిక్కెట్లు విడులయ్యాయి. అభ్యర్థులు tnpsc.gov.in, tnpscexams.in అనే వెబ్‌సైట్‌ల నుంచి హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. మొత్తం 3,935 పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ రాతపరీక్ష నిర్వహిస్తోంది. ఓఎంఆర్ విధానంలో ఈ నెల 12న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్ష జరుగనుందని టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.

స్టెమ్‌సెల్ చికిత్సపై అవగాహన పెరగాలి



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ కామరాజ్, డాక్టర్ జయరాణి

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్టెమ్‌సెల్ చికిత్సపై అవగాహన పెరగాలని ఆసియా ఓషియానా ఫెడరేషన్ ఆఫ్ సెక్సాలజీ (ఏఓఎఫ్ఎస్) ఉపాధ్యక్షులు డాక్టర్ కామరాజ్ పేర్కొన్నారు. వడపళనిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో ప్రతిరోజు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయని, అందులో స్టెమ్‌సెల్ (మూల కణం) థెరపీ ప్రమాదకర వ్యాధుల నుండి దూరం చేస్తుందని తెలిపారు. వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ సెక్సాలజీలో ప్రధాన భాగమైన ఏఓఎఫ్ఎస్ ఉపాధ్యక్షుడిగా తనను ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ క్రిస్టోఫర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియమించారని, ఈ రంగాన్ని మరింత అభివృద్ధి పరచేందుకు కృషిచేస్తానన్నారు. విద్యారంగం, సినీ రంగంలో కూడా ప్రస్తుతం డ్రగ్స్ సంప్రదాయం విస్తృతంగా పెరిగిందని, దీనివల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డాక్టర్ జయరాణి బృందంతో కలిసి ప్రచారం సాగించనున్నట్లు కామరాజ్ తెలిపారు.

ఏసీ బస్సులు బయలుదేరే ప్రాంతాలివే



డిపోలో నిలిపివున్న ఏసీ బస్సులు

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఏసీ బస్సులను నగరంలో ఏఏ ప్రాంతాల నుంచి నడపనుందనే వివరాలను చెన్నై మెట్రో పాలిటన్ కార్పొరేషన్ (ఎంటీసీ) బుధవారం ప్రకటించింది. ప్రయాణికులకు మరిన్ని వసతులు కల్పించేలా రాష్ట్రప్రభుత్వ సహకారంతో ఎంటీసీ చేపట్టిన చర్యల్లో భాగంగా లోఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సు సేవలు సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. తొలివిడతగా వీటిలో పల్లవన్ హౌస్‌రోడ్డులోవున్న సెంట్రల్ డిపో నుండి వంద బస్సులు, పెరుంబాక్కం డిపో నుండి 55 బస్సులు, తండయార్‌పేట-1వ డిపో నుండి 25 బస్సులు, పూందమల్లి డిపో నుండి 45 ఏసీ బస్సులు నడపనున్నారు. అదేవిధంగా రెండోవిడతగా 600 ఎలక్ట్రిక్ లోఫ్లోర్ బస్సుల్లో 400 ఏసీ బస్సులు నడపనున్నట్లు ఎంటీసీ ప్రకటించింది. ఈ బస్సులు ఆలందూరు డిపో నుంచి 80, సెంట్రల్ బస్ డిపో-2 నుండి 80, పాడినల్లూర్ డిపో నుంచి 40, పెరంబూరు డిపో నుండి 80, ఆవడి డిపో నుండి 60, అయ్యప్పన్ తాంగల్ 60 ఏసీ బస్సులను నడపనున్నట్లు ఎంటీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

సమస్యల పరిష్కారానికి కృషి

● పోలీసు కమిషనర్ అరుణ్



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న కమిషనర్

పెరంబూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ సూచించారు. వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషన్ అరుణ్ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 34 వినతులు రాగా, వాటిని విచారించి పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.



రామనాథపురం ఉత్తరకోశమంగై ఆలయంలో ఆణితిరుమంజనం అలంకారంలో కూత్తర్ పెరుమాన్, అమ్మవారు



గల్లంతైన తలకోన ఎగువ ఝరి

తలకోనలో మదనపల్లె యువకుడి గల్లంతు



గల్లంతైన షహీల్

ఎర్రావారిపాలెం, జూలై2 (ఆంధ్రజ్యోతి): తలకోన ఎగువన ఈతకు దిగి గల్లంతయ్యాడో యువకుడు. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన రియాజ్ ఆటోడ్రైవర్ కుమారుడు షహీల్ (21) ఆరుగురు మిత్రులతో కలిసి బుధవారం తలకోనకు వచ్చాడు. తలకోన పైభాగంలోని ఎగువ ఝరి వరకు ఎక్కారు. అక్కడి ఎగువగుండంలో సరదాగా ఈతకు దూకారు. నీటి మడుగు నుంచి షహీల్ ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో తోటి స్నేహితులు డయల్ 100కు సమాచారమిచ్చారు. ఎస్ఐ బాలకృష్ణ వెంటనే పీలేరు ఫైర్ సర్వీస్‌కు తెలియజేసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, ఫైర్, అటవీ సిబ్బంది ఎంత వెతికినా షహీల్ అచూకీ తెలియలేదు. చీకటిపడటంతో వారు వెనుదిరిగారు. శేషాచలంలో ఎత్తు నుంచి నీరు మడుగులోకి వస్తుంది. ఆ నీరు సొరంగాల ద్వారా కింది భాగంలోకి ప్రవహిస్తుంది. నీటి మడుగున సొరంగం ఉందని తెలియక పోవడం, సరిగా ఈత రాకపోవడంతో ఈ యువకుడు గల్లంతయ్యాడని భావిస్తున్నారు. సాధారణంగా జలపాతం దిగువన ఈతకు దిగుతారు. ఎగువ ఝరి ప్రమాదకరం. అంత ఎత్తుకు వెళ్లడానికి అనుమతి కూడా లేదు. ఇటీవల కొందరు యువకులు అధికారుల కళ్ళు కప్పి అక్కడికి చేరుకుని సెల్ఫీలు దిగుతున్నారు.

పశుసంవర్ధక డిప్లొమా దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

తిరుపతిరూరల్, జూలై2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తిరుపతి కేంద్రంగా నడిచే ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలోని యానిమల్ హజబెండరీ పాలిటెక్నిక్‌లో డిప్లొమా కోర్సుల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 7వతేది వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ, అనుబంధ కళాశాలలో రెండేళ్ల కాలవ్యవధితో ఆంగ్లమాధ్యమంలో ఆఫర్ చేసే ఈ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఇతర వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ 'ఎస్వీవీయూ.ఈడీయూ.ఇన్'ని సంప్రదించాలని కోరారు.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.97 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,126

తలనీలాలు సమర్పించినవారు: 24,720





తిండి కోసం ప్లాస్టిక్ కవర్లనే తినేస్తున్న పందులు, కుక్కలు

ప్లాస్టిక్ కవర్లలో మిగిలిపోయిన తిండిని వెతుక్కుంటున్న పశువులు

ప్లాస్టిక్ సిటీ

మళ్లీ తిరుపతి నగరాన్ని కమ్మేసిన భూతం

నిషేధాన్ని నీరుగార్చేశారు

ఏడేళ్ల కిందట అత్యంత సమర్థంగా ప్లాస్టిక్ నిషేధం అమలైన తిరుపతి నగరాన్ని మళ్లీ ప్లాస్టిక్ భూతం ఆక్రమించేసింది. నాయకుల పట్టనితనం, అధికారుల ఉదాశీనత వల్ల తిరుపతి ప్లాస్టిక్ సిటీగా మారిపోయింది. అందుకు సాక్ష్యమే ఈ చిత్రాలు...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేడు ప్లాస్టిక్ కవర్ల వ్యతిరేక దినోత్సవం

వర్తమానం దారుణం

2025 జూలై 2: రాష్ట్రంలో అధికారం మారినా తిరుపతి నగరంలో ప్లాస్టిక్ తీరు మారలేదు. కూటమి నాయకులు ప్లాస్టిక్ భూతం జోలికి వెళ్లలేదు. అధికారులు కూడా మనకెందుకీ తలనొప్పి అని ఊరకుండిపోయారు. ఫలితంగా నగరం మొత్తం ప్లాస్టిక్ మయం అయిపోయింది. అత్యంత పలుచనైన కవర్లు సైతం విస్తృతంగా వినియోగంలోకి వచ్చేశాయి. ముంజులు మొదలు, సకల సరకులూ వాటిల్లోనే ఇస్తున్నారు. ఆఖరికి వేడివేడి టీ కూడా ప్లాస్టిక్ కవర్లలో పోసి పార్శిల్ ఇస్తున్నారు. కేన్సర్ కారకం అని ఎంత మొత్తుకున్నా ప్రజలు కూడా మారడం లేదు. కవర్లను మానడం లేదు. వాడేసిన ప్లాస్టిక్ కవర్లే చెత్తకుప్పల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన మురుగు కాలువల్లో పారుదల ఆగిపోతోంది. నగర వీధుల్లో తిరిగే పందులూ, పశువులూ ఆఖరికి కుక్కలు కూడా ఆహార పదార్థాల వ్యర్థాలున్న కవర్లను తినేస్తున్నాయి. స్వచ్ఛసర్వేక్షణ్‌లో ప్లాస్టిక్ ఫ్రీ సిటీ అంటూ గొప్పలు చెప్పుకోవడమే కానీ, వాస్తవం మాత్రం దారుణంగానే ఉంది.



గతం ఘనం

2018 అక్టోబరు2: గాంధీ జయంతి సాక్షిగా తిరుపతి నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమలులోకి వచ్చింది. అప్పటికే నగరంలో ప్రజలకు దీనిపై విస్తృతంగా అవగాహన కలిగించారు. అప్పటి కమిషనర్ విజయరామరాజు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సహా అనేక సంస్థలు భాగం అయ్యాయి. పెద్ద దుకాణాల నుంచి బండ్ల వ్యాపారుల దాకా అందరూ సహకరించారు. తమ ఆరోగ్యం కోసమే అని ప్రజలు అర్థం చేసుకున్నారు. అన్ని రకాల ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు బంద్ అయ్యాయి. ప్రత్యామ్నాయంగా కాయితం పొట్లాలు వినియోగంలోకి వచ్చాయి. చికెన్ దుకాణాలకి ప్రజలు ఇంటి నుంచి స్టీలు డబ్బాలతో వెళ్లడం అలవాటు చేసుకున్నారు. డ్వాక్రా సంఘాలు, నిరుద్యోగులను ప్రత్యామ్నాయ వస్తువులు తయారుచేసేలా ప్రోత్సహించారు. విజయరామరాజు తర్వాత తిరుపతి కమిషనర్‌గా వచ్చిన గిరీష కూడా ఇదే స్ఫూర్తితో నిషేధం అమలును కొనసాగించారు. రెండేళ్లపాటు తిరుపతి నగరం ప్లాస్టిక్ రహితంగా కనిపించింది. 2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రెండేళ్లపాటూ ఇదే పరిస్థితి తిరుపతి నగరంలో కనిపించింది. ఆ తర్వాత వైసీపీ నేతలు నిదానంగా నీరుగార్చే పని మొదలు పెట్టారు. ప్లాస్టిక్ కవర్ల తయారీ యూనిట్లకూ వైసీపీ నేతలకూ ఒప్పందం కుదిరిందనే ప్రచారం జరిగింది. యదాతథంగా మొత్తం అన్ని రకాల ప్లాస్టిక్ కవర్లూ మళ్లీ వచ్చేశాయి. మూడేళ్ల శ్రమ వృధా అయిపోయింది. నేతలకు ముడుపులు ముట్టడంతోనే ఇందుకు తెగబడ్డారనే విమర్శలు వచ్చాయి. నిషేధం కోసం రోడ్ల మీదకు వచ్చి కష్టపడ్డ సంస్థలు కూడా వైసీపీ వారితో మనకెందుకులే అని మిన్నకుండిపోయారు. ప్లాస్టిక్ భూతం మళ్లీ తిరుపతి నగరాన్ని కమ్మేసింది.



కాలువ మూత తెరిస్తే ప్లాస్టిక్ భూతం ప్రత్యక్షం(మధురానగర్‌లో)

కార్పొరేషన్‌పై వ్యర్థాల భారం

నగరంలో నాన్ బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు నగరపాలక సంస్థకు మోయలేనంత ఆర్థిక భారం పడుతోంది. ప్లాస్టిక్‌తో నిండిపోయిన కాలువలు, డ్రైన్లను శుభ్రపరిచేందుకు రూ57.13 లక్షలను ఏటా వెచ్చిస్తోంది.



మంగళం రోడ్డులో



పాస్టిక్ కవర్లూ, వ్యర్థాలతో ప్రగతినగర్, కొరమేనుగుంట ప్రాంతాల్లో పేరుకుపోయిన మురుగు కాలువలు



● సప్తవర్ణ శోభితం

గోవిందుడి పుష్పయాగం

తిరుపతి అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం కన్నులపండువగా పుష్పయాగం జరిగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4గంటల వరకు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. మూడు టన్నుల మేర(12రకాల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల పత్రాలు) పత్ర, పుష్పాలతో ఉత్సవర్లను అభిషేకించారు. వీటిని ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు సమకూర్చారు. సాయంత్రం ఉత్సవర్లు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో శాంతి, ఉద్యానవనాధికారి శ్రీనివాసులు, ఏఈవో గోపీనాథ్, అర్చకస్వాములు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో వరి పంటకు పిచికారి

పంటల సాగులో డ్రోన్ల వాడకం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. బుధవారం బుచ్చినాయుడు కండ్రిగలో రైతు నాగేశ్వరనాయుడు డ్రోన్‌తో వరిపంటకు పురుగు మందులను పిచికారీ చేయించారు. ఎకరం పంటకు డ్రోన్‌తో ఐదు నిమిషాల్లో పిచికారీ చేసేశారు. దీనికి బాడుగ రూ.400 వసూలు చేశారు.

- బుచ్చినాయుడుకండ్రిగ, ఆంధ్రజ్యోతి





'తొక్కిసలాట' ఘటనపై తుదిదశకు న్యాయవిచారణ

● ఈనెలలో ప్రభుత్వానికి నివేదిక

● తిరుపతికి వచ్చిన జస్టిస్ సత్యనారాయణమూర్తి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 2(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి' తొక్కిసలాట ఘటనలో న్యాయవిచారణ ముగింపుదశకు వచ్చింది. ఈ నెలలో తుదినివేదకను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి బుధవారం తిరుపతికి చేరుకున్నారు. శ్రీవారి వైకుంఠ ఏకాదశి ద్వార దర్శన టోకెన్ల పంపిణీకి సంబంధించి జనవరి 8న తిరుపతిలోని పద్మావతి పార్కు వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతిచెందగా, 44మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తిని ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు బాధితులు, సస్పెండైన అధికారులతో పాటు విధుల్లో ఉన్న వివిధ శాఖల అధికారులు.. ఇలా సుమారు వందమందిని వివిధ దశల్లో విచారించారు. సుమారు 2వేల పేజీల స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు తెలిసింది. ఇక, భవిష్యత్తులో టీటీడీ ఆలయాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సలహాలతో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వడానికి శ్రీవారి ఆలయంతో పాటు క్యూలైన్లను జస్టిస్ సత్యనారాయణమూర్తి పరిశీలించారు. న్యాయవిచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు నెలల గడువు ముగింపునకు రావడంతో చివరిసారిగా బుధవారం రాత్రి జస్టిస్ సత్యనారాయణమూర్తి తిరుపతికి వచ్చారు. కాగా, గురువారం కలెక్టరేట్‌లో పర్యటన.. శ్రీవారిని దర్శించుకుని వెళ్లనున్నారు.

భక్తుల సేవలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

● టీటీడీలో 'ఎస్మా' అమల్లో ఉంది

● ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు సిద్ధమంటూ ప్రకటన

తిరుపతి(వైద్యం), జూలై 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు సేవలు అందించే కాంట్రాక్టు ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసనలకు దిగితే చర్యలు తప్పవని టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. కాంట్రాక్టు ఉద్యోగులు వారి సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని టీటీడీ పేర్కొంది. 'భక్తుల సేవలకు ఉద్యోగులు ఆటంకం కలిగించే చర్యలను నిషేధించే ముఖ్యమైన సేవల నిర్వహణ చట్టం(ఎస్మా) టీటీడీలో అమల్లో ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్టు ఉద్యోగులు వారి విధులను బాధ్యతగా నిర్వర్తించాలి. ప్రపంచవ్యాప్త గుర్తింపున్న అధ్యాత్మిక సంస్థల్లో విధులను బహిష్కరించడం సరికాదు. నిబంధనలు ఉల్లంఘించి సమ్మెబాట పడితే ఎస్మా చట్టాన్ని అమలు చేస్తాం. ఎస్ఎల్ఎస్ఎంపీసీ సంస్థతోపాటు కాంట్రాక్టు, పలు సొసైటీల్లో పని చేస్తున్న ఉద్యోగులు విధులను బహిష్కరిస్తే ఎస్మా చట్ట ప్రకారం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. గతంలో ఇదే తరహాలో విధులను బహిష్కరిస్తే మళ్లీ విధుల్లోకి తీసుకున్నాం. ఈసారి తొలగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విధుల్లోకి తీసుకునేది లేదు. ఉద్యోగుల విధులకు టీటీడీతో సంబంధం లేని బయట వ్యక్తులు ఆటంకం కలిగిస్తే క్రిమినల్ చర్యలకూ వెనకాడం' అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.



తిరువాడనైలో జింకల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి

ప్యారీస్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తిరువాడనైలో రోజురోజుకు జింకల సంతతి పెరుగుండడంతో జింకల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తిరువాడనైలో వాగులు, విస్తరించిన అడవీ ప్రాంతాల్లో పదేళ్లగా జింకల సంఖ్య ఘననీయంగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా తిరువాడనై, అంజుకోట, మంగళంకుడి, ఎస్పీపట్టణం తదితర గ్రామీణ ప్రాంతాలు అడవుల్లో ఉన్నందువల్ల మేతమేస్తూ గ్రామాల్లోకి వస్తున్నాయి. వేసవిలో నీటికోరం కాలువల వద్దకు వెళ్తున్న సమయంలో కుక్కల దాడికి గురై జింకలు బలవుతున్నాయి. అరుదైన జాతికి చెందిన ఈ జింకలను కాపాడేలా రాష్ట్ర ప్రభుత్వం తిరువాడనై ప్రాంతంలో సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని జంతుప్రేమికులు కోరుతున్నారు.

నేడు గుమ్మిడిపూండి మార్గంలో 38 సబర్బన్ రైళ్ల రద్దు

ఐసీఎఫ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్‌లోని గుమ్మిడిపూండి-కవరపేట రైల్వేస్టేషన్ల మధ్యలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు 38 రైళ్లు రద్దు చేశారు. ఆ ప్రకారం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, సూళ్లూరుపేట-నెల్లూరు-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-గుమ్మిడిపూండి మధ్య సబర్బన్ రైళ్లు రద్దయ్యాయి. ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్ పొన్నేరి, చెన్నై బీచ్-పొన్నేరి, చెన్నై సెంట్రల్-మీంజూరు, చెన్నై సెంట్రల్-ఎన్నూర్ మధ్య 21 ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.